క్లుప్తంగా

నేడు పెద్దేముల్‌కు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: మండల కేంద్రానికి శనివారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాలక్ష్మి పథకంలో భాగంగా సబ్సిడీ ద్వారా రూ.500లకు గ్యాస్ సిలిండర్ పొందుతున్న అర్హులైన మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా గుర్తింపు పత్రాలు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు గుర్తింపు పత్రాలు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

దుద్యాల్: ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మంజూరైన గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన రూ.500లకే సిలిండర్ గుర్తింపు పత్రాలను మండలంలోని హస్నాబాద్ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో పథకం అమలు చేస్తూ మన్ననలు పొందుతుందని లబ్ధిదారులు అభిప్రాయపడ్డారు. ఈ పత్రాలను గ్రామానికి సంబంధించిన రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్లు వెంకటేశ్, మహేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై స్పెషల్ డ్రైవ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్‌లో ఓటరు జాబితాపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో ఓటర్లు 7,150 మంది ఉండగా 14 వార్డులు ఉన్నాయి. ఇప్పటికే వార్డుల వారీగా ఓటరు జాబితాను అధికారులు పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించారు. వాటిలో తప్పులు ఉన్నట్లు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు ఎంపీఓ ఆనంద్‌రావు అధ్యక్షతన 25 మంది పంచాయతీ కార్యదర్శులు కరన్‌కోట్ గ్రామంలో పర్యటించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముఖ్యంగా చనిపోయిన, వలస వెళ్లిన ఓటర్ల తొలగింపుతో పాటు వేరే వార్డుల్లో ఉన్న ఓటర్లు.. మరో వార్డుల్లోకి వచ్చారని నాయకులు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉదయం నుంచి రాత్రి వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తొలగించారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

తాండూరు రూరల్: తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తాండూరు మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు ఎంపీడీఓ కార్యాలయంలో, పట్టణంలోని లబ్ధిదారులకు మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు.

గ్యాస్ సబ్సిడీ..

మర్పల్లి: మహాలక్ష్మి పథకం కింద రూ.500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన గుర్తింపు పత్రాలను శనివారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అందజేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, పార్టీ శ్రేణులు, లబ్ధిదారులకు సూచించారు.

కల్తీ టీ పొడర్, నిషేధిత గుట్కా పట్టివేత

కుల్కచర్ల: ఉమ్మడి జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల ఆధ్వర్యంలో నిషేధిత గుట్కా, కల్తీ టీపొడర్, అల్లం వెల్లుల్లి సామగ్రిని పట్టుకున్న ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శుక్రవారం చౌడాపూర్‌తో పాటుగా వివిధ గ్రామాల్లోని దుకాణ సముదాయాలను తనిఖీ చేసింది. ఇందులో 20 కిలోల కల్తీ టీ పొడర్, 1500 గుట్కా ప్యాకెట్లు, కొంత మొత్తంలో అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను పట్టుకున్నారు. కాగా ఈ వస్తువులను విక్రయించిన వారిపై లోతైన విచారణ కొనసాగుతుందని ఎస్ఐ తెలిపారు.

వికారాబాద్‌లో మోస్తరు వర్షం



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో వర్షం కొద్దిగా పడినా రాత్రి మాత్రం బాగానే కురిసింది. దీంతో వాతావరణమంతా చల్లబడింది. పలుచోట్ల రోడ్లపై వరద నీరు చేరి రాకపోకలను అంతరాయం కలిగించింది.

మూడేళ్లుగా మూత

- నిరుపయోగంగా మారిన శుద్ధజల కేంద్రాలు
- హస్నాబాద్‌లో తాగునీటికి తీవ్ర ఇబ్బంది



భీమరాయ దేవాలయం వద్ద నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

దుద్యాల్: తాగునీటికి శుద్ధజల కేంద్రాలు లేక గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని హస్నాబాద్‌లో భీమరాయ గుడి దగ్గర, ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాలు మూడేళ్ల క్రితమే మూతపడిపోయాయి. అప్పట్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శుద్ధజల కేంద్రాల ద్వారా రూ.5కే ఇరవై లీటర్ల నీటిని అందిస్తుండడంతో పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. గ్రామస్తులే కాక ఇతర కాలనీల నుంచి ఈ ప్లాంట్ వద్ద నీటిని తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఈ రెండు ప్లాంట్లు మూతపడడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేక కుళాయి నీటిని తాగుతూ రోగాల బారిన పడుతున్నారు. ఆర్థిక సామర్థ్యం ఉన్న వారు ప్రైవేట్ ప్లాంటులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని వాటర్ ప్లాంట్‌లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుళాయి నీటితో అనారోగ్యం

గ్రామస్తులు కుళాయి నీటిని తాగడంతో అనారోగ్యం పాలవుతున్నారనే ఉద్దేశంతో 2020లో ప్రభుత్వం రెండు శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేయగా వాటిని 2021లో ప్రారంభించారు. ఎస్సీ కాలనీ ఉన్న ప్లాంట్లు దాదాపు ఏడాది పాటు కొనసాగింది. అప్పటి నుంచి నేటి వరకు శుద్ధజల కేంద్రాలు పూర్తిగా మూతబడి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అధికారులు వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు విన్నవిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

తిరిగి ప్రారంభించాలి



ప్రైవేట్ శుద్ధ జలల వద్ద అధిక ధరలకు నీటిని కొనలేక పోతున్నాం. ప్రభుత్వ శుద్ధజల కేంద్రాల ద్వారా అందించే 20 లీటర్ల నీటిని రూ.5లకే అందిస్తారు. పేదప్రజలు కుళాయి నీటినే ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు శుద్ధజల కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి.

– బండారి నర్సింలు, హస్నాబాద్

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ క్రీడల్లో సైతం ఆసక్తి కనబర్చాలని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంఈఓ రాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అనిల్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం ఎంఈఓ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రీడలతో ఏకాగ్రత పెరిగి చదువులో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 42 బాలికల జట్లు, 46 బాలుర జట్లు ఖోఖో పోటీల్లో పాల్గొన్నాయి. మొత్తం 1,080 విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, హెచ్‌ఎం మురళీధర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయలు అనిల్‌కుమార్, అజీజ్, ఉపాధ్యాయులు ఆనంద్‌రావు, వెంకటేష్, నర్సింలు, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో నైపుణ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంగ్లిష్‌లో నైపుణ్యాలు పెంచాలని ఎంఈఓ చంద్రప్ప ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్య అనే అంశంపై శుక్రవారం కోట్‌పల్లి మానవ వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సరళ పదాలతో అనువైన పద్ధతిలో ఇంగ్లిష్ నేర్పించాలన్నారు. ఆంగ్లంపై విద్యార్థులకు మక్కువ పెరిగి భయం తొలగిపోతుందన్నారు. దీనిపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు జరిగినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ అరుణ్‌కుమార్, రిసోర్స్ పర్సన్‌లు జయశ్రీ, నరేష్, అఖిల, లావణ్య ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ బోధనకు కృషి

కుల్కచర్ల: ఆంగ్లంలో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని చౌడాపూర్ మండల నోడల్ ఆఫీసర్ రాంచందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మరికల్ గ్రామంలో క్లస్టర్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్ల బోధనలో గ్రామీణ విద్యార్థులకు అవగతమయ్యేలా బోధన ఉండాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు సర్వమంగళ, సీఆర్పీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

4,712 మందికి రుణమాఫీ

ఏడీఏ రుద్రమూర్తి వెల్లడి

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ తాండూరు డివిజన్‌లో 4,712 మంది రైతులకు వర్తించిందని డివిజన్ వ్యవసాయశాఖ (ఏడీఏ) రుద్రమూర్తి తెలిపారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రూ.2 లక్షలలోపు మూడో విడతలో బషీరాబాద్-558, కోట్‌పల్లి-703, పెద్దేముల్-767, తాండూరు-1871, యాలాల-813 రైతులకు రుణమాఫీ అయ్యిందని పేర్కొన్నారు. అదేవిధంగా వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులు 842 మంది ఉన్నారన్నారు. ఇందులో గ్రూఫ్ ఫొటో సమస్య ఉందన్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఏఓ, ఏఈఓలు రైతు వేదికల వద్ద రైతుల గ్రూఫ్ ఫొటో క్యాప్చర్ నిర్వహిస్తున్నారని తెలిపారు. 225 మందికి సంబంధించి ఆధార్‌కార్డ్ డేటా, బ్యాంక్ సమస్యలు గుర్తించామన్నారు. కార్యాలయానికి వస్తున్న రైతుల సమస్యలు 90 శాతం పరిష్కరించామని చెప్పారు. రైతులు ఎవరూ రుణమాఫీ కాలేదని కార్యాలయానకి రావొద్దన్నారు. క్షేత్రస్థాయిలో ఏఓ, ఏఈఓలు గ్రామాలకు వచ్చి పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తాండూరు మండల ఏఓ కొమరయ్య, ఏఈఓలు ఉన్నారు.

మేత లేక.. ఆరు నెలలు నడక

పెద్దేముల్: గత రాష్ట్ర ప్రభుత్వం గొల్లకుర్మల అభివృద్ధి కోసం గొర్రెల పథకాన్ని చేపట్టడంతో మార్కెట్‌లో జీవాలకు డిమాండ్ పెరిగింది. నారాయణపేట జిల్లాకు చెందిన గొర్రెల కాపరులు ఆగస్టు మొదటి వారంలో జీవాలను కాసుకుంటూ సంగారెడ్డి వరకు వస్తామన్నారు. దాదాపు ఆరు నెలలు జీవాలను మేపి స్వగ్రామం చేరుకుంటామని కాపరులు పేర్కొన్నారు. శుక్రవారం పెద్దేముల్ పంట పొలాల్లో గొర్రెలు మేస్తుండగా 'సాక్షి' కాపరులు పలకరించింది. తమ ప్రాంతంలో మేత లేకపోవటంతో వలస వస్తున్నామని వారు తెలిపారు.



పెద్దేముల్ పంట పొలంలో మేస్తున్న నారాయణపేట గొర్రెలు

మిట్టకోడూర్ ఫీల్డ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్

పరిగి: మండల పరిధిలోని మిట్టకోడూర్ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్యపై ఉన్నత అధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉపాధి హామీ పథకంలో నిర్వహించే పనుల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కొంత మందికి పనులు చేయకుండా డబ్బులు వేయించారని ఆరోపించడంతో అధికారులు విచారణ చేపట్టారు. అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయంపై ఏపీఓ ఉషను వివరణ కోరగా ఉన్నత అధికారులు తమకు కాల్ చేసి మిట్టకోడూర్ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెన్షన్ చేస్తున్నట్లు చెప్పారన్నారు. అతనికి ఎలాంటి పనులు చెప్పవద్దని, వేతనాలు ఆపివేయాలని సూచించారని తెలిపారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

దోమ: కేంద్రం ప్రవేశ పెడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దాదాపూర్‌లో గ్రామానికి చెందిన మహ్మద్ గౌషియాబేగం ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. అయితే ఆమె బ్యాంకులో ఏటా రూ.20 ప్రీమియంతో బీమా చేయించుకుంది. దీంతో బీమాకు సంబంధించి రూ.రెండు లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలంతా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బీమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

మర్పల్లి: పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చని మర్పల్లి సీడీపీఓ ప్రవీణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌమర దశలో చిన్నారుల ఎదుగుదల ఎంతో ముఖ్యమన్నారు. అందుకు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, మాంసకృతులను ఆహారంగా భుజించాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రిజ్వాన, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ

ప్రత్యేకాధికారులకు సూచించిన అడిషనల్ కలెక్టర్



కుల్కచర్ల: మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

కుల్కచర్ల: గ్రామాల్లో 'ప్రత్యేక పాలన' కొనసాగుతున్న నేపథ్యంలో సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేకాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొన్నదన్నారు. ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడంతో కొంత ఆర్థికంగా నిధులు లేని పరిస్థితిలో ప్రత్యేకాధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్, చౌడాపూర్ తహసీల్దార్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి

దోమ: అమ్మ ఆదర్శ పాఠశాలలో మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని ఊటుపల్లి, తిమ్మాయిపల్లి, దోమలో ఉన్న ఆదర్శ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి ఆంగ్లంలో చదవడం, రాయడాన్ని ఉపాధ్యాయులు నేర్పించాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో వివిధ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంపీఓ సోమలింగం, మండల నోడల్ అధికారి వెంకట్, ఏపీఎం సురేశ్, ఏపీఓ దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



సోండేపూర్‌తండాలో ఇంటింటికి తిరిగి పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

పరిగి: పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కరీం సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని సోండేపూర్, రూప్‌ఖాన్‌పేట్, చిరురాల్‌పల్లి గ్రామ పంచాయతీల్లో పర్యటించి శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తప్పకుండా మరుగుదొడ్డిని నిర్మించుకోవాలన్నారు. ఇంటి పరిసరాలల్లో ప్రజలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాలువల పరిసరాల్లో బ్లీచింగ్ పొడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో వీధుల గుండా పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. గ్రామ ప్రజలు పారిశుధ్య నిర్వహణ కోసం కార్మికులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

కొడంగల్ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి నవీన్ డ్రాయింగ్‌లో ప్రతిభ చూపారు. మాస్టర్ వెంకట్‌రావు ఇచ్చిన శిక్షణ మేరకు దేశ నాయకుల చిత్రాలను గీశారు. సర్వేపల్లి రాధాకృష్ణ, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ చిత్రపటాలను పేపర్‌పై డ్రాయింగ్ వేశారు. వాటిని శుక్రవారం కళాశాల ఆవరణలో ఎంఈఓ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ఆవిష్కరించారు.



విద్యార్థి గీసిన దేశ నాయకుల చిత్రపటాలను చూపుతున్న ఎంఈఓ రాంరెడ్డి

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



వికారాబాద్‌లో ర్యాలీ..

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో శుక్రవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రధాన వీధుల గుండా ఆలంపల్లి వరకు కొనసాగింది. ర్యాలీలో యువకులు, మతపెద్దలు, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం ఆధ్వర్యంలో..

ధారూరు: మండల కేంద్రంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ర్యాలీని ఎంఐఎం మండల పార్టీ అధ్యక్షుడు మోయిజ్‌ఖురేషి ఆధ్వర్యంలో ముస్లింలు నిర్వహించారు. గ్రామంలోని జామ మసీదు నుంచి ప్రారంభమైన ర్యాలీ కమాన్, బస్టాండు మీదుగా లతీఫ్ ఉన్నీసా మసీదు వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధారూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఐఎం నాయకులు

పాఠాలు చెప్తారా.. లేదా?

- పంతుళ్ల రగడపై గ్రామస్తుల ఆగ్రహం
- కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆందోళన
- శాంతింపజేసిన పోలీసులు



గ్రామస్తులు, ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ విక్రమ్

కుల్కచర్ల: నిరుపేద విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన మీరే ఒకరినొకరు దూషించుకుంటూ గొడవలు పెట్టుకోవడం ఏంటని కొత్తపల్లి గ్రామస్తులు ఉపాధ్యాయుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామ పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులు, యువజన సంఘాల నాయకులు ఆశ్రమ పాఠశాలలో ఆందోళనకు దిగారు. విషయాన్ని కొందరు పోలీసులకు తెలపడంతో మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట ఠాణా ఎస్ఐ విక్రమ్ పాఠశాలకు చేరుకొని యువకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులందరినీ కూర్చోబెట్టి అభిప్రాయాలు సేకరించారు. ఎవరూ ఇతరులకు ఇబ్బందులు సృష్టించకూదన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. పిల్లలకు పాఠాలు చెప్తారా.. లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంతుళ్ల వ్యవహారం ఇబ్బందికరంగా మారిందన్నారు. ఇక్కడ పని చేస్తున్న వారందరిని బదిలీ చేయాలన్నారు. అర్హత గల స్థానికులకు బోధించే అవకాశం కల్పించాన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలకు వికారాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వెళ్లి పరిస్థితిని పరిశీలించి అక్కడ జరుగుతున్న పరిణామాలను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. కాగా పంతుళ్ల పంచాయితీ కారణంగా రెండు రోజులుగా పాఠ్య బోధన సరిగ్గా జరగడంలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పాలనాధికారి స్పందిస్తే తప్ప తమ సమస్య పరిష్కారం కాదని చిన్నారులు అభిప్రాయపడుతున్నారు.